ఆధ్యాత్మిక కేంద్రంగా
విలసిల్లుతున్న చెప్రాల



6
చప్రాలలో రామాలయం

జగమేలు స్వామి జగన్నాథుడు

- చెన్నూరులో పూరీ తరహాలో జగన్నాథస్వామి ఆలయం
- ఆలయానికి 400 ఏండ్ల చరిత్ర
- నేటికీ వంశపారపర్యంగానే కొనసాగుతున్న పూజలు
- పూరీ మాదిరిగానే ఇక్కడ రథయాత్ర



7
ఆలయంలో భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్న అర్చకులు

న్యూస్ బాక్స్

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

చెన్నూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిష్టంపేట గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం పీఏసీఎస్ చైర్మన్ చల్ల రాంరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు హేమంత్‌రెడ్డి, బాపగౌడ్, నాగరాజు, శ్రీనివాస్‌రెడ్డి, రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హాజీపూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గుడిపేట విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ మహేందర్ తెలిపారు. గుడిపేట, నంనూర్, చందనాపూర్, ముల్కల్లలో సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

19న వాక్ ఇన్ ఇంటర్వ్యూ

మంచిర్యాల అర్బన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని వివే కవర్ధిని డిగ్రీ కళాశాలలో ఈనెల 19న ఉదయం 10:30 గంటలకు వాక్ ఇన్ ఇంటర్వ్యూ జరుగుతుందని కళాశాల కరస్పాండెంట్ ఉదారి చంద్రమోహన్, ప్రిన్సిపాల్ ఆర్.శ్రీనివాస్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అప్ గ్రాడ్ వారి సహకారంతో హెచ్‌డీఎఫ్‌సీ, ముథూట్ ఫిన్‌కార్ప్ బ్యాంకులలో నెలకు రూ.20 వేల వేతనంతో శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగాలకు ఇంటర్వ్యూ జరుగుతుందని, డిగ్రీ, బీటెక్‌లో 50శాతం మార్కులతో ఉత్తీర్ణులై 30 యేండ్లలోపు వయస్సు ఉన్న వారు అర్హులని తెలిపారు. వివరాలకు 8106764653, 7095381280 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

నేడు నేత్ర వైద్య శిబిరం

నెన్నెల, నవంబరు 15 (ఆంధ్ర జ్యోతి): బెల్లంపల్లి వంద పడకల ఆసుపత్రిలో ఈ నెల 16న గడ్డం వర్ష-వరుణ్‌పార్థసారథిల ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. శుక్రవారం ఇంటింటికి తిరిగి కంటి సమస్యలతో బాధపడుతున్న వారి వివరాలను సేకరించారు. వారిని బెల్లంపల్లికి తరిస్తామన్నారు. హైదరా బాద్‌కు చెందిన వైద్యులు పరిశీలించి అద్దాలు అందజేస్తారన్నారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గట్టు మల్లేష్, నాయకులు బొమ్మెన హరీష్‌గౌడ్, తోట శ్రీనివాస్, మల్లాగౌడ్ పాల్గొన్నారు.



గూడెం గోదావరి నదిలో కార్తీక స్నానాలు ఆచరిస్తున్న భక్తజనం

కార్తీకమయం..

జిల్లాలో కార్తీక పౌర్ణమి సందడి నెలకొంది. భక్తులు శుక్రవారం ఉదయం నదీ స్నానాలు ఆచరించారు. అనంతరం సత్యనారాయణ స్వామి వ్రతాలు, దీపదానాలు చేశారు. గూడెం గుట్టపై నిర్వహించిన మహా జాతరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రాంగణమంతా భక్తజనంతో నిండింది. పలు ఆలయాలను భక్తులు సందర్శించారు.

- గూడెంలో కార్తీక పౌర్ణమి జాతర
- భక్తులతో పోటెత్తిన ఆలయం
- సత్యనారాయణ స్వామి వ్రతాలు, దీపారాధనలు
- గోదావరి నది స్నానాలు ఆచరించిన భక్తులు
- కిటకిటలాడిన పలు ఆలయాలు



గూడెం ఆలయ ముఖ ద్వారం వద్ద భక్తుల రద్దీ

దండేపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం గూడెం గుట్టపై కొలువైన రమాసహిత సత్యనారాయణస్వామి ఆలయంలో శుక్రవారం కార్తీక పౌర్ణమి మహాజాతర జరిగింది. పలు జిల్లాల నుంచి భక్తులు కుటుంబ సమేతంగా తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణమంతా భక్తజనంతో నిండిపోయింది. ఆలయ సమీపంలోని గోదావరి నదిలో భక్తులు స్నానాలు ఆచరించారు. గోదావరినదిలో భక్తులు కార్తీకస్నానాలు ఆచరించి, నదిలో దీపారాధన చేశారు. అనంతరం ఆలయానికివచ్చి సత్యదేవుడిని దర్శించుకున్నారు. గుట్టకింద నుంచి ఘాట్‌రోడ్డు ద్వారా పైకి వెళ్ళడానికి భక్తుల సౌకర్యంకోసం భారీకేడ్లు, షామి యానాలు, తాగునీరు ఏర్పాటు చేశారు. స్వామి దర్శనం కోసం గంటల తరబడి క్యూలో నిలబడాల్సి వచ్చింది. వేదపండితులు, అర్చకులు స్వామి వారికి అభిషేకాలు, పుష్పాలంకరణ, మహా హారతీ, హోమాలు నిర్వహించారు. దీంతో గూడెం గుట్ట భక్తజనసంద్రోహంగా మారింది. భక్తులు సత్యనారాయణస్వామి, అయ్యప్పస్వామి, సాయిబాబా ఆలయాలను సందర్శించారు. ఆలయం ప్రాం గణంలో రావిచెట్టు వద్ద కార్తీక దీపాలను వెలిగించారు. పిల్లపాపలు, కుటుంబ సభ్యులు చల్లంగా ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలంటూ పూజలు చేశారు.

ఎమ్మెల్యే ఆధ్వర్యంలో సేవ కార్యక్రమాలు..

కార్తీక పౌర్ణమి మహాజాతర సందర్భంగా ఈనెల 13నుంచి కొక్కిరాల రఘపతిరావు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో భక్తులకు ఉచితంగా పులిహోర, మజ్జిగ, తాగునీరు మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు-సురేఖ దంపతుల సమక్ష్యంలో నాయకులు పంపిణీ చేశారు. భక్తులకు ఇబ్బందులు కల్గకుండా ఆలయం వద్ద ఎమ్మెల్యే పర్యవేక్షించారు. వారి కార్యకర్తలు, పిఎస్ఆర్ వాలంటీర్లు క్యూలో భక్తులకు తాగునీరు అందించారు.

సత్యదేవున్ని దర్శించుకున్న ప్రముఖులు.

కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని గూడెం దేవాలయంలో ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు-సురేఖ దంపతులు, వరంగల్ రేంజ్ జైలర్ శాఖ డీఐజీ సంపత్ దంపతులు, డీసీపీ భాస్కర్ దంపతులు కార్తీక వ్రతాలను ఆచరించారు. కలెక్టర్ కుమార్ దీపక్, మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, ఏసీపీ ప్రకాష్‌లు సత్యదేవున్ని దర్శించుకున్నారు. కార్తీక మాసంలో సత్యనారాయణ స్వామి వత్రం ఆచరిస్తే మంచి జరుగుతుందని భక్తుల నమ్మకం. దేవస్థానం ప్రధానఆలయంలో రూ.1500, కింద వ్రత మండపంలో రూ.600 రెండు వ్రత మండపాల్లో

మిగతా 7లో







గూడెంలో సత్యదేవుడిని దర్శించుకుంటున్న కలెక్టర్ కుమార్, ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు దంపతులు, సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

ప్రారంభానికే పరిమితం

- 2009లో లెదర్ పార్క్ భవనం ప్రారంభం
- నిరుపయోగంగా మారిన వైనం
- అన్యాక్రాంతమవుతున్న స్థలం
- ఎమ్మెల్యే వాఖ్యలతో చిగురిస్తున్న ఆశలు



తోళ్ల పరిశ్రమ షెడ్ (ఫైల్)

మందమర్రి టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రాణహిత కాలనీ సమీపంలో తోళ్ల పరిశ్రమ నిరుపయోగంగా మారింది. పరిశ్రమ భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. 2007లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చెన్నూరు ఎమ్మెల్యే, కార్మిక శాఖ మంత్రిగా ఉన్న జీ వినోద్ 25 ఎకరాల స్థలంలో రూ.20 లక్షలతో లెదర్‌పార్కు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 2009లో పనులు పూర్తికాగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం టీడీపీ ప్రభుత్వం 2001లో మలుపు కింద చర్మకారులకు చెప్పులు, బూట్లు, ఇతర సామగ్రి తయారీకి శిక్షణ ఇచ్చింది. మందమర్రిలో 600మంది చర్మకారులను ఎంపిక చేసి పాత బస్టాండ్‌లో ఓ ప్రైవేటు భవనం అద్దె తీసుకొని మూడు నెలలు పాటు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు ఇచ్చారు. శిక్షణ పొందిన వారు ఉపాది అవకాశాలు లభిస్తాయని ఆశతో ఎదు రు చూశారు. తిరిగి ఎప్పుడు ప్రారంభ మవుతుందో అని ఎదురు చూస్తున్నారు. 15 సంవత్స రాలు గడిచినా పార్కు ప్రారంభం కాలేదు. శిక్షణ పొందిన వారికి ఉపాధి లభించలేదు.

లెదర్ పార్కు స్థలం అన్యాక్రాంతం...

లెదర్ పార్కుకు కేటాయించిన 25 ఎకరాల స్థలం క్రమక్రమంగా ఆక్రమణకు గురైంది. హద్దులు లేకపోవడం మూలంగా పార్కు స్థలం ఎక్కడి వరకు ఉందనేది తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. దశాబ్ద కాలం క్రితమే లెదర్ పార్కు సమీపంలో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేశారు. జూనియర్ కళాశాల కూడా నిర్మించారు. కళాశాలకు సంబంధించి కొంతస్థలాన్ని కేటాయించారు. ప్రస్తుతం లెదర్ పార్కు రెండు ఎకరాలస్థలం మాత్రమే మిగిలింది. స్థలానికి హద్దులు ఏర్పాటు చేయకపోవడం వల్ల మెల్లమెల్లగా అన్యాక్రాంతంకు గురైందని ఎంఆర్‌పీఎస్ నాయకులు ఆరోపిస్తున్నారు.

లెదర్ పార్కు సమీపంలో సోలార్ ప్లాంటు ఏర్పాటు..

ఇటీవలే ప్రాణహిత కాలనీ ఆనుకొని ఉన్న ఖాళీ స్థలంలో సోలార్ ప్లాంటును సింగరేణి యాజమాన్యం ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ప్లాంటు పనులను కాంట్రాక్టర్‌కు అప్పగించింది. సదరు కాంట్రాక్టర్ ఇటీవల స్థలంలో పిచ్చి మొక్కలను తొలగించారు. 40 నుంచి 50 ఎకరాల స్థలం ఉందని గుర్తించారు. ఇతర పనులకు సంబంధించి సామగ్రి తరలించేందుకు పార్కు పక్క నుండే రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఇది తెలుసుకున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు కాంట్రాక్టర్‌తో వాగ్వాదానికి దిగారు. రోడ్డుపనులు చేపట్టవద్దని ఆందోళన చేపట్టారు. విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. పనులను ఆపివేయాలని ఎమ్మెల్యే కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

స్థలాన్ని పరిశీలించిన అధికారులు...

లెదర్ పార్కు స్థలంలో నుంచి రోడ్డు వేయడం వివాదాస్పదంగా మారడంతో ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి రెవెన్యూ, సింగరేణి అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. ప్లాంటుకు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించారు. వివరాలను ఇన్‌చార్జి జీఎం రాందాస్ వివరించారు. లెదర్ పార్కు స్థలంలో రోడ్డు వేయవద్దని, ప్రాణహిత కాలనీ నుంచి రోడ్డు వేసుకోవాలని సూచించారు. త్వరలోనే హద్దులు పెట్టాలని కూడా ఎమ్మెల్యే రెవెన్యూ సింగరేణి అధికారులను కోరారు.

లెదర్ పార్కును ప్రారంభిస్తాం..

-ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి



లెదర్ పార్క్ ప్రారంభించేందుకు కృషి చేస్తా. ఇటీవల ముఖ్యమంత్రిని కలిసి రాష్ట్రంలోని 9 లెదర్ పార్కుల పరిస్థితిని వివరించా. వీటికి బడ్జెట్ సపోర్టు చేయాలని కోరాను. దీనిపై ముఖ్యమంత్రి కూడా సానుకూలంగా ఉన్నారు. లెదర్ ఇండస్ట్రీ ద్వారా ఎంతో మందికి ఉపాది అవకాశాలు లభిస్తాయి. సింగరేణి, రెవెన్యూ అధికారులు మందమర్రిలో లెదర్ పార్కు స్థలానికి హద్దులు ఏర్పాటు చేస్తారు.

లెదర్ పార్కును ప్రారంభించాలి..

- రేగుంట సునీల్ మాదిగ, మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షులు



ప్రారంబానికే పరిమితమైన లెదర్ పార్కులకు సంబంధించి ప్రభుత్వం చొరవ చూపాలి. మందమర్రిలో పార్కుకు ఉన్న 25 ఎకరాల స్థలానికి హద్దులను సింగరేణి, రెవెన్యూ వారు ఏర్పాటు చేయాలి. స్థలాన్ని ఆక్రమిస్తున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి. చెప్పులు కుట్టుకొని జీవనం సాగించేందుకు ఏర్పాటు చేసిన పరిశ్రమ కొనసాగకపోడం వల్లనే సమస్యలు తలెత్తుతున్నాయి.

గిరిజనుల అభివృద్ధికి ఉత్కర్ష్ అభియాన్ పథకం



కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు, విద్యార్థులు

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ గిరిజనుల అభివృద్ధి దిశగా ధర్తీ అబ ఉత్కర్ష్ అభియాన్ పథకాన్ని ప్రధాని మోదీ ప్రారంభించారని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పథకం ప్రారంభోత్సవ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ మోతిలాల్, నోడల్ అధికారి సీతారాం, డీఎంహెచ్‌వో హరీష్ రాజ్‌లతో కలిసి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ భగవాన్ బీర్సా ముండా జయంతి పురస్కరించుకుని ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. ఈ పథకం ద్వారా గిరిజన నివాస ప్రాంతాల్లో గిరిజనులకు నీళ్లు, ఆరోగ్యం, టెలికాం, విద్యుత్, గృహ నిర్మాణ వంటి కనీస సౌకర్యాల కల్పన అమలు చేస్తామన్నారు. బీర్సా ముండా చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఏటీడీవో పురుషోత్తం, ఏసీఎంవో రాజమౌళి, గిరిజన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెగడపల్లి ఆవాసంలో గ్రామసభ

తాండూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : భగవాన్ బిస్రా ముండా జయంతి పురస్కరించుకుని కొత్తపల్లి గ్రామపంచాయతీలోని పెగడపల్లి ఆవాసంలో జన జాతీయ గౌరవ దినోత్సవం సందర్భంగా గ్రామసభ నిర్వహించారు. పెసా చట్టం, గ్రామసభ హక్కులు, అటవీ చట్టం, పరిరక్షణ గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాల రహిత సమాజం కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు. మండల పంచాయతీ అధికారి అనిల్‌కుమార్, ఇన్‌చార్జీ పంచాయతీ కార్యదర్శి జగదీష్, ప్రజలు పాల్గొన్నారు.

సంచార మెడికల్ యూనిట్ ప్రారంభం



మెడికల్ యూనిట్ వాహనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం భగవాన్ బీర్సా ముండా జయంతిని పురస్కరించుకుని ప్రధాన మంత్రి ధర్తీ అబ ఉత్కర్ష్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లాకు కేటాయించిన సంచార మెడికల్ యూనిట్‌ను ప్రారంభించామని కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. జిల్లాలోని 21 గిరిజన గ్రామాల్లో ఈ వాహనం సంచరిస్తూ వైద్య సేవలు అందిస్తుందన్నారు. వైద్యాధికారులు అనిత, అనిల్, విశేవ్వేశ్వర్‌రెడ్డి, డీపీవో ప్రశాంతి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్ 3 అభ్యర్థులు సకాలంలో హాజరు కావాలి

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెల 17,18 తేదీల్లో జరగనున్న గ్రూప్ 3 పరీక్షకు అభ్యర్థులు సకాలంలో హాజరు కావాలని కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 48 కేంద్రాలను ఏర్పాటు చేశామని, 15,038 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని తెలిపారు. నోడల్ అధికారిగా మోతిలాల్, పోలీసు నోడల్ అధికారిగా బెల్లంపల్లి ఏఆర్ఏసీపీ సుందర్, రీజియన్ కోఆర్డినేటర్‌గా నరేందర్‌రెడ్డిలను నియమించామన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్‌తోపాటు గుర్తింపు కార్డు తీసుకురావాలన్నారు. ఈ నెల 17న ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్ 1, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్ 2, 18న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్ 3 పరీక్షలు ఉంటాయన్నారు.

ప్రిన్సిపాల్స్ సంఘం రాష్ట్ర కోశాధికారిగా లక్ష్మణ్‌రావు



మంచిర్యాల అర్బన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ సంఘం రాష్ట్ర కోశాధికారిగా కె.లక్ష్మణ్‌రావు ఎన్నికయ్యారు. శుక్రవారం హైదరాబాద్ నాంపల్లిలో గల సంఘం కార్యాలయంలో ఎన్నికలు జరిగాయి. కోశాధికారి పోటీలో నిలిచిన ఆయనకు మెజార్టీ ఓట్లు రాగా ఎన్నికయ్యారు. పలువురు ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాల్స్ శుభాకాంక్షలు తెలిపారు.

నేత్రదానం

లక్సెట్టిపేటరూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వెంకట్రావుపేట గ్రామానికి చెందిన బొమ్మిడి అరుణ్‌కుమార్ (26) శుక్రవారం ఉదయం 6 గంటలకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బంధువుల కోరిక మేరకు నేత్రదానానికి ముందుకు రాగా లయన్స్‌క్లబ్ మంచిర్యాల, గోల్డెన్ జూబ్లి వారి ఆధ్వర్యంలో డాక్టర్ అభిషేక్ సహకారంతో నేత్రాలను సేకరించి హైద్రాబాద్‌లోని ఎల్‌వీ ప్రసాద్ ఐ బ్యాంకుకు పంపించారు. ప్రోగ్రాం చైర్మన్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ నేత్రదానం ఎంతోగొప్పదని పేర్కొన్నారు. మరణానంతరం ఆరు గంటల లోపు నేత్రాలను సేకరించాలన్నారు. సభ్యులు రాకేష్‌రెడ్డి, ఆనంద్, సుగుణాకర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రామాంజనేయులు, బాబు, శివ ప్రసాద్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

తప్పులు లేకుండా సర్వే చేయాలి

జైపూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను తప్పులు లేకుండా చేయాలని ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో శ్రీపతి బాపురావులు పేర్కొన్నారు. శుక్రవారం గంగిపెల్లి, ఎల్కంటి, పెగడపల్లి గ్రామపంచాయతీల్లో చేపడుతున్న సర్వేను పరిశీలించారు. ఎన్యూమరేటర్లు ప్రతీ ఇంటిని సర్వే చేయాలని సూచించారు. గంగిపెల్లి గ్రామపంచాయతీలో రికార్డులను పరిశీలించారు.

ప్రియుడి ఇంటి ఎదుట ప్రియురాలి ధర్నా



వివరాలు తెలుసుకుంటున్న సఖీ కేంద్ర నిర్వాహకులు

భీమిని, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని నమ్మించి లోబర్చుకొని మోసం చేసిన ప్రియుడి ఇంటి ఎదుట శుక్రవారం యువతి ధర్నాకు దిగింది. కన్నెపల్లి మండలంలోని ఐదపల్లి గ్రామానికి చెందిన యువతి, భీమిని మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన పుట్ట శ్రీకాంత్ ప్రేమించుకున్నారు. ప్రియుడి ఇంటి ఎదుట రెండు రోజుల క్రితం ధర్నా చేయగా పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. అయినా పట్టించుకోకపోవడంతో శుక్రవారం మళ్ళీ బైఠాయించింది. మంచిర్యాల సఖీ కేంద్ర నిర్వాహకులు, ఎస్సై గంగారాం సంఘటనా స్థలానికి చేరుకోని యువతితోపాటు ఇరువురు కుటుంబీకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. తాండూర్ సీఐ కుమారస్వామి యువతి కుటుంబీకులతో మాట్లాడి పరారీలో ఉన్న శ్రీకాంత్ ఆచూకీ కనిపెట్టి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమయ్య కుల పెద్దలు ప్రియురాలికి మద్దతు తెలిపారు.

గుండెపోటుతో బాలిక మృతి



నివృత్తి (ఫైల్)

చెన్నూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పద్మనగర్ కాలనీకి చెందిన నివృత్తి (12) గుండెపోటుతో శుక్రవారం మృతిచెందింది. పద్మనగర్ కాలనీకి చెందిన శ్రీనివాస్-రమ దంపతులకు ఒక కూతురు నివృత్తి, కొడుకు ఉన్నారు. కూతురు నివృత్తి ఓ ప్రైవేటు పాఠశాలలో 7వ తరగతి చదువుతోంది. కార్తీక పౌర్ణమి పాఠశాలకు సెలవు కావడంతో ఇంటి వద్దనే ఉంది. ఉదయం ఇంట్లో ఆడుకుంటూ ఒక్కసారిగా కుప్పకూలింది. గమనించిన కుటుంబీకులు వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించారు పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందిందని తెలిపారు. గుండె పోటుతో మృతిచెందినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. పండగ పూట బాలిక మృతి చెందడంతో కుటుంబంతోపాటు కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. నివృత్తి మృతి వార్త తెలుసుకున్న ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు కన్నీటి పర్యంతమయ్యారు.

అనారోగ్యంతో లష్కర్ మృతి

సిర్పూర్(టి), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నాగమ్మ చెరువు లష్కర్‌గా విధులు నిర్వహిస్తున్న నవేగాం గ్రామానికి చెందిన రాంటెంకి నానాజీ(58) శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందాడు. మూడు రోజుల క్రితం పక్షవాతం రాగా కుటుంబీకులు హైదారాబాద్‌కి తీసుకెళ్లారు. అక్కడచికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారి ప్రభాకర్ అంత్యక్రియల కోసం ఆర్థికసాయం అందజేశారు. మృతుడి కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని ఇరిగేషన్ శాఖ సిబ్బంది పేర్కొన్నారు.

సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి

కన్నెపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మసీదుల్లో, ఆలయాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఎస్ఐ గంగారాం సూచించారు. శుక్రవారం కన్నెపల్లి పోలీస్‌స్టేషన్‌లో వివిధ మతాల పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ ఆలయాలు, మసీదుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే రక్షణ ఉంటుందన్నారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని పేర్కొన్నారు. సీసీ కెమెరాల ద్వారా ఏదైనా నేరాలు, సంఘటనలు జరిగినప్పుడు నిందితులను సులువుగా గుర్తించవచ్చన్నారు. అలాగే గ్రామాల్లోని అన్ని మతాల వారు కలిసిమెలిసి ఉండాలని సూచించారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

మందమర్రి టౌన్, నవంబర్ 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మూడో జోన్‌కు చెందిన గురిజాల మొగిలి ఇటీవల రైలు కింద పడి ఆత్మహత్య చేసుకోగా విషయం తెలుసుకున్న 1980-81 జిల్లా పరిషత్ పాఠశాల పూర్వ విద్యార్థులు శుక్రవారం ఆ కుటుంబానికి రూ.19 వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాంవెంకటేశ్వర్లు, వాసాల శంకర్, రవి, రాజన్న పాల్గొన్నారు.

రోడ్డుపై తేలిన ఇనుప రాడ్లు

- ప్రమాదంలో ప్రయాణికులు



రోడ్డుపై తేలి ఉన్న రాడ్లు

మందమర్రిటౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సింగరేణి పాఠశాల ఎదురుగా ఉన్న కోల్‌బెల్ట్ రోడ్డుపై ఇనుప రాడ్లుకు బయటకు వచ్చింది. దీంతో రాత్రి పూట రాడ్లను గమనించని వాహనదారులు దానికి తగిలి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల పలువురు రాడ్లను గమనించి తప్పించబోయి కింద పడిన సంఘటనలు ఉన్నాయి. గతంలో సింగరేణి యాజమాన్యం ఇక్కడ కోలిండియా పోటీలు జరిగిన సందర్భంగా ఆర్చ్‌ను ఏర్పాటు చేసింది. ఇటీవల రోడ్డును వెడల్పు చేయడంతో పాటు డివైడర్ ఏర్పాటు చేయడంతో ఈ ఆర్చ్‌ను తొలగించారు. దీంతో ఇప్పుడు రోడ్డు మధ్యలో ఉన్న రాడ్లు బయటకు వచ్చాయి. ప్రమాదాలు జరగకు ముందే అధికారులు స్పందించి రోడ్డుపై ఉన్న రాడ్లను తొలగించాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా గుంత



రోడ్డు పక్కన ఉన్న వాల్వు గుంత

తాండూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేణు నగర్ (బోయపల్లి బోర్డు) సమీపంలో సర్వీసు రోడ్డు రహదారి పక్కన మిషన్ భగీరథ పైపులైన్ కోసం ఏర్పాటు చేసిన వాల్వు గుంత ప్రమాదకరంగా మారింది. చాంబర్ ఏర్పాటు చేయకుండా అధికారులు నిర్లక్ష్యంగా వదిలేశారు. దీంతో రహదారి పక్కనే గుంత ఉండడంతో వాహనదారులు, కాలినకడన వెళ్లే వారు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళ వాహనదారులు గుంతలో పడే ప్రమాదం ఉందని పలువురు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి గుంతపై చాంబర్ ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఆధ్యాత్మిక కేంద్రంగా విలసిల్లుతున్న చెప్రాల



చప్రాలలోని ప్రశాంత ధామ్

బెజ్జూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దుల్లో నెల కొన్న చెప్రాల ఆధ్యాత్మిక కేంద్రం భక్తుల కొంగుబంగారంగా మారింది. ఓ పక్క ప్రాణహిత, పెన్‌గంగా పరవళ్లు, మరో పక్క దట్టమైన అటవీప్రాంతం. అలరించే ప్రకృతి అందాల మధ్య నెలకొని ఉంది చెప్రాల. పచ్చని అడవులు, నదులు ప్రశాం తత ఇస్తుండడంతో భక్తులు మైమరిచి పోతుంటారు. బెజ్జూరు, సరిహద్దుల్లో గల మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా చాముర్షి తాలుకాలో చెప్రాల ఆధ్యాత్మిక కేంద్రం కొలువై ఉంది. దట్టమైన అభయారణ్యంలో ఉన్నా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు ఉండవు. ఇక్కడికి నిత్యం తెలంగాణలోని పలు ప్రాంతాల నుంచి కాకుండా మహారాష్ట్ర నుంచి భక్తులు వస్తుంటారు. హనుమాన్ ఆలయంలో భక్తులు పూజలు, భజనలు చేస్తారు.



శివాలయం, సాయిబాబా ఆలయం



కార్తీక్ మహారాజ్ స్వామికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు (ఫైల్)

ఆలయ చరిత్ర..

మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా చాముర్షి తాలుకాలోని చెప్రాల అటవీ ప్రాంతానికి 1951 ప్రాంతంలో కార్తీక్‌స్వామి అనే ఆధ్యాత్మికవేత్త వచ్చా డు. కార్తీక్‌స్వామి ఎక్కడి నుంచి వచ్చారో ఇప్పటికీ ఎవరికి తెలియదు. అటవీప్రాంతంలో ఉండే పండ్లు తింటూ ఉండేవాడని, అక్కడ ఉన్న హనుమాన్ విగ్రహానికి రోజు పూజలు చేసేశారని అక్కడి ప్రజలు చెబుతుంటారు. పక్కనే ఉన్న ప్రాణహిత నదిలో స్నానాలు ఆచరించి హనుమాన్‌కు పూజలు చేస్తుండే వాడు. ఇలా రోజు పూజలు చేస్తున్న కార్తీక్ స్వామిని అక్కడి ప్రజలు చూసి ఆయన భక్తులుగా మారారు. కార్తీక్ స్వామి అక్కడే ఉంటూ మరిన్ని ఆలయాలు ఏర్పాటు చేయించారు. అక్కడి ఆలయంలో శివాలయం, కృష్ణుడి ఆలయం, దుర్గామాత, శ్రీరాముడు, సాయి బాబా, గజానన్ బాబా తదితర ఆలయాలను నిర్మించేలా కృషి చేశారు. దీంతో సమీప ప్రాంతాల్లోనే కాకుండా మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో ఆయనకు భక్తులు ఏర్పడ్డారు. పలు ప్రాంతాల్లో నూతన ఆలయాలకు, ప్రతిష్ఠాపన సందర్భంగా పలు ప్రాంతాలకు వెళ్లేవారు. 2013 ఫిబ్రవరిలో కార్తీక్‌స్వామి స్వర్గస్తులయ్యారు. కార్తీక్ స్వామికి భక్తులు ఆలయంలోనే సమాధి ఏర్పాటు చేసి విరాళాలతో ఆలయాన విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. భక్తులంతా ఆయన సమాధి వద్ద ప్రత్యేకపూజలు చేస్తారు. కార్తీక్ స్వామి అంటే రెండు రాష్ట్రాల భక్తులకు ఎనలేని నమ్మకం. ఏ ఆపద వచ్చినా ఆయన్ని దర్శించుకుంటే తొలగిపోతా యనేది వారి నమ్మకం.

చెప్రాల ఆధ్యాత్మికత, ఆహ్లాదంతో కూడి ఉంటుంది. ప్రాణహిత, పెన్‌గంగా నదులు చెంతనే ఉండడంతో అక్కడికివెళ్లే భక్తులు ప్రాణహితలో స్నానాలు ఆచరించి పూజలు చేస్తుంటారు. విద్యార్థులు విహార యాత్రలకు వస్తుంటారు. పలు ప్రాంతాల నుంచి భక్తులు పాదయాత్రలు చేసి అక్కడే రాత్రి బస చేసి భజనలు, భోజనాలు చేస్తారు. ఇక్కడికి వచ్చే భక్తులకు బస చేసేందుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ఆలయకమిటీ గదులు నిర్మించింది.

పండుగల వేళ భక్తుల రద్దీ..

చెప్రాల ఆధ్యాత్మిక కేంద్రంలో పండగల వేళ భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. శ్రీరామనవమి, హనుమాన్ జయంతి, మహాశివరాత్రి, కార్తీకపౌర్ణమి పర్వదినాల్లో వేడుకలు ఘనంగా జరుపుతారు. మహారాష్ట్రలోనే కాకుండా తెలంగాణ ప్రాంతం నుంచి భక్తులు తరలివస్తుంటారు.

సమస్యలు పరిష్కరించాలి

● కలెక్టర్‌కు టీఎస్‌టీడబ్ల్యూటీయూ నాయకుల వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీఎస్‌టీడబ్ల్యూటీయూ నాయకులు

ఆసిఫాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని శుక్రవారం టీఎస్‌టీడబ్ల్యూటీయూ నాయకులు కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలల్లో భోజన వ్యక్తులను క్యాటరింగ్‌కు అప్పగించి కేవలం పర్యవేక్షణ బాధ్యతలను మాత్రమే హెచ్ఎంలకు అప్పగించాలన్నారు. బదిలీ అయిన ఉపాధ్యాయుల స్థానాల్లో ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు అశోక్‌కుమార్, ప్రసాద్, ఉద్ధవ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

వైకల్యాన్ని జయించి.. మూడు ప్రభుత్వ ఉద్యోగాలు



తల్లిదండ్రులతో రాహుల్

ఆసిఫాబాద్ రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఒక్క ఉద్యోగం సాధించానికే చాలా కష్టమవుతున్న ఈ రోజుల్లో మూడు ప్రభుత్వఉద్యోగాలు సాధించి తన ప్రతిభను చాటుకున్నాడు పట్టణానికి చెందిన పుల్లూరి రాహుల్. ఇటీవల ప్రకటించిన ఉపాధ్యాయ ఫలితాల్లో స్కూల్‌అసిస్టెంట్‌గా, ఎస్టీటీ ఉద్యోగాలకు ఎంపిక అవ్వగా, గురువారం ప్రకటించిన గ్రూపు-4లోనూ వార్డు ఆఫీసర్ ఉద్యోగాన్ని పొందాడు. ప్రస్తుతం రాహుల్ స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. పూర్తి స్థాయి అంధత్వం ఉన్నా అందరితో పాటు సాధారణ పాఠశాల, కళాశాలలో చదివి ఉత్తమఫలితాలను సాధించి ఆదర్శంగా నిలిచాడు. ఆసిఫాబాద్ పట్టణానికి చెందిన పుల్లూరి రాజబాపు, సుజాతల రెండో కుమారు డైన రాహుల్ విద్యాభ్యాసం మొత్తం జిల్లాలోనే పూర్తి చేశాడు. వీరితండ్రి ప్రస్తుతం ట్రైబల్ వెల్ఫేర్ డిపార్టుమెంట్‌లో డిప్యూటీ సెక్రెటరీగా పనిచేస్తున్నాడు. కాగా భవిష్యత్‌లో గ్రూప్స్ సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు రాహుల్ పేర్కొన్నాడు.

ఘనంగా బీర్సా ముండా జయంతి



బెజ్జూరులో నివాళులు అర్పిస్తున్న ఆదివాసీలు

బెజ్జూరు/చింతలమానేపల్లి/జైనూర్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రాల్లో శుక్రవారం ఆదివాసీ సంఘం ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు బీర్సా ముండా జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జైనూర్‌లో గ్రామపంచాయతీ సిబ్బంది ప్రజలతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం పెసా గ్రామసభలు నిర్వహించారు.

జాతీయ గ్రామీణ ఉత్కర్ష్ అభియాన్‌పై అవగాహన

కౌటాల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కౌటాల మండలంలోని వీర్దండి గ్రామంలో శుక్రవారం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జనజాతీయ గ్రామీణ ఉత్కర్ష్ అభియాన్ కార్యక్రమం ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 21అంశాలు చదివి వినిపించారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ రేణుక, కార్యదర్శి సురేష్, ఎస్‌హెచ్‌జీ మహిళలు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు, నాయకులు

వెటరన్ అథ్లెటిక్స్‌లో రాణిస్తున్న పెరుక కృష్ణ

● జాతీయ స్థాయిలో ప్రతిభ



లాంగ్‌జంప్ పోటీల్లో పెరుక కృష్ణ(ఫైల్)

కాగజ్‌నగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వెటరన్ పోటీల్లో ఎస్పీఎం ఉద్యోగి పెరుక కృష్ణ(56) చక్కటి ప్రతిభ కనబరుస్తున్నాడు. ఒకవైపు ఉద్యోగం, మరోవైపు క్రీడలపై ఉన్న ఆసక్తిని ప్రదర్శిస్తున్నాడు. పరుగు పందెం, లాంగ్ జంప్, ట్రిపుల్‌జంప్ పోటీల్లో ఎంతో ప్రతిభ కనబరుస్తున్నాడు. పోటీల్లో ఆయన సాధిస్తున్న పతకాలకు ఎస్పీఎం యాజమాన్యంతో పాటు తోటి క్రీడాకారులు, ఉద్యోగులు ఘనంగా అభినందిస్తున్నారు.

కృష్ణ సాధించిన పతకాలు..

కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన పెరుక కృష్ణ రాష్ట్రస్థాయిలో 100మీటర్ల పరుగు పందెంలో 20, 200 మీటర్లలో 20, 400మీటర్లలో 6పతకాలు సాధించారు. అలాగే జాతీయస్థాయిలో ఏడు పతకాలు సాధించారు. అలాగే లాంగ్ జంప్ విభాగంలో 10పతకాలను సాధించాడు.

మరిన్ని పతకాలు సాధిస్తా..

-పెరుక కృష్ణ



నాకు క్రీడలంటే ఎంతో ఇష్టం. నేను ఉద్యోగం చేస్తున్నప్పటికీ వెటరన్ క్రీడా పోటీల్లో పాల్గొంటున్నాను. ఇప్పటివరకు చాలా క్రీడాపోటీల్లో పాల్గొన్నాను. రానున్న రోజుల్లో మరిన్ని పతకాలు సాధిస్తాను.



ఏరియా ఆసుపత్రిపై నిర్లక్ష్యం వీడాలి

బెల్లంపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సింగరేణి ఏరియా ఆసుపత్రిపై యాజమాన్యం నిర్లక్ష్యం వీడాలని సింగరేణి ఏరియాఆసుపత్రి పరిరక్షణకమిటీ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం ఆసుపత్రి ఆవరణలో వారు మాట్లాడుతూ ఆసుపత్రిలో వైద్యులను నియమించడంలో, వైద్యసేవలు అందించడంలో యాజమాన్యం విఫలమవుతోందన్నారు. మందుల కొరత ఉందన్నారు. రెండు నెలల క్రితం క్యాజువాలిటీలో కాలంచెల్లిన విద్యుత్‌వైర్లతో షార్ట్ సర్క్యూట్ జరిగిందని, మళ్లీ గురువారం స్పెషల్ రూమ్ షార్ట్ సర్క్యూట్ జరిగి మంటల చెలరేగి ఏసీ, ఫర్నీచర్ కాలిపోయాయన్నారు. సింగరేణి యాజమాన్యం ఆసుపత్రిపై నిర్లక్ష్యం వీడి ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వైద్యులను, సిబ్బందినినియమించి మెరుగైన సేవలందించాలన్నారు. కార్యక్రమంలో మణిరాంసింగ్, చాంద్‌పాషా, ఓజీర్, శంకర్, మహేందర్, పోచమల్లు, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

పోటీల్లో ఉద్యోగుల ప్రతిభ

జైపూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం ఏరియాలో శుక్రవారం సింగరేణి సంస్థ నిర్వహించిన కంపెనీ లెవెల్ కల్చరల్ మీట్2024 పోటీల్లో జైపూర్‌లోని ఎస్టీపీపీ నుంచి అధికారులు ప్రతిభ కనబర్చి బహుమతులు సాధించారు. ఫోర్‌మెన్ ఎలక్ట్రికల్ రవీంద్ర కుమార్ స్వామి వేణుగానంలో, సీనియర్ అసిస్టెంట్ శ్రీనిధి కర్ణాటక సంగీతంలో ప్రతిభ కనబర్చారు. కొత్తగూడెం జీఎం షాలెంరాజు చేతులమీదుగా మొదటి బహుమతులు అందుకున్నారు. ఈసందర్భంగా ఎస్టీపీపీ ఈడీ రాజశేఖర్‌రావు వీరిని అభినందించారు.

ఐటీ ఆప్షన్ ఎంపిక చేసుకునేందుకు మరో అవకాశం

శ్రీరాంపూర్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఉద్యోగులు తమ ఆదాయపు పన్ను చెల్లింపునకు ఆప్షన్ ఎంపిక చేసుకునేందుకు మరో అవకాశం కల్పిస్తున్నట్లు శ్రీరాంపూర్‌డీజీఎం(పర్సనల్) పి అరవిందరావు ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25ఆర్థిక సంవత్సరానికి ఆప్షన్-1, ఆప్షన్-2ను ఈనెల26లోగాఎంపిక చేసుకోవాలన్నారు. ఇప్పటివరకు సరైనఆప్షన్ ఇవ్వని ఉద్యోగులు గడువులోగా తమ ఆప్షన్‌ను గనులు/విభాగాలలో అందించాలని కోరారు.

స్ట్రక్చర్ సమావేశంతో సమస్యల పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న సీతారామయ్య

శ్రీరాంపూర్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఈనెల28న సింగరేణి డైరెక్టర్‌తో జరిగే స్ట్రక్చర్ సమావేశంతో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఏఐటీయూసీ రాష్ట్రఅధ్యక్షుడు వి సీతారామయ్య రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె రాజ్‌కుమార్ అన్నారు. నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో వారిద్దరు విలేకరులతో మాట్లాడారు. 11వవేతన ఒప్పందంలో భాగంగా నిర్ణయించిన ప్రకారం ఎన్‌సీడబ్ల్యూఏ ఉద్యోగులకు ఇన్సెంటివ్, ఇతర అలవెన్సులు ఇవ్వాలన్నారు. ఇప్పటివరకు ఉద్యోగులపిల్లలకు ఇస్తున్న స్కాలర్‌షిప్‌ను 20వేల రూపాయల నుంచి 50వేలలకు పెంచాలని తదితర డిమాండ్లు చేస్తామని తెలిపారు. సమావేశంలో ఉపప్రధానకార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముష్కెసమ్మయ్య, బ్రాంచ్‌కార్యదర్శి ఎస్కే బాజీసైదా, సహాయ కార్యదర్శి మోత్కూరికొమురయ్య, నాయకులు పాల్గొన్నారు.

బొగ్గు బ్లాకులపై కేంద్రం కుట్ర



సమావేశంలో మాట్లాడుతున్న అఖిల పక్షం నాయకులు

మందమర్రిటౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా బొగ్గు బ్లాకులను ప్రైవేటుపరం చేసే కుట్రలకు పాల్పడుతోందని అఖిలపక్షం నాయకులు సంకె రవి, పార్వతి రాజిరెడ్డి, దూలం శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం సీఈఆర్ క్లబ్‌లో బొగ్గుగనుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సహజ సంపదను సంపన్నులకు దోచి పెట్టే ప్రయత్నాలను కేంద్రం చేస్తోందన్నారు. సింగరేణిలోని నాలుగు బొగ్గు బ్లాకులను బేషరతుగా సింగరేణికే కేటాయించాలన్నారు. ఈనెల18నుంచి సంతకాలు సేకరించి గవర్నర్, కేంద్ర కార్మిక మంత్రి కిషన్‌రెడ్డికి ఇవ్వనున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు రంజిత్‌కుమార్, కనికరపు అశోక్, దాగం శ్రీనివాస్, రాజేంద్ర ప్రసాద్, అనిల్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉద్యోగుల పదోన్నతికి పరీక్షలు

శ్రీరాంపూర్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఏరియాలోని ఉద్యోగులకు హెడ్‌చైన్‌మన్ పదోన్నతి కోసం శుక్రవారం పరీక్షలు నిర్వహించారు. ఎస్ఓటు జీఎం ఎన్ సత్యనారాయణ సమక్షంలో వృత్తిశిక్షణ కేంద్రంలో రాత, ప్రాక్టికల్ పరీక్షలు జరిగాయి. నాలుగు ఖాళీల భర్తీకి నిర్వహించిన పరీక్షలకు లాటరీ పద్ధతిలో ప్రశ్నాపత్రాలను ఎంపికచేసి అభ్యర్థులకు అందించారు. కార్యక్రమంలో నిర్వహణ కమిటీసభ్యులు డీజీఎం(పర్సనల్) పి అరవిందరావు, ఏరియా సర్వేఅధికారి వెంకటేశం, వీటీసీమేనేజర్ కల్వారి వెంకటరామారావు, తదితరులు పాల్గొన్నారు.

గైర్హాజరు ఉద్యోగులకు కౌన్సెలింగ్

రెబ్బెన, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గోలేటి సీఈఆర్ క్లబ్‌లో గైర్హాజరయిన ఉద్యోగులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జి జీఎం మచ్చగిరి నరేందర్ మాట్లాడుతూ ఉద్యోగులు నిత్యం విధులకు హాజరైతే సంస్థతో పాటు వారి కుటుంబానికి ప్రయోజనమన్నారు. ఆరోగ్యసమస్యలుంటే ఆసుపత్రిలకు వెళ్లి వైద్యుల సూచనలు, సలహాలుపాటించి త్వరగా కోలుకునేందుకు మంచి పోషకాహారం తీసుకరావాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకుడు శేషశయనరావు, డీజీఎం (ఐఈడీ) ఉజ్వల్‌కుమార్ బెహర, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్‌పర్సనల్‌మేనేజర్ శ్రీనివాస్, జూనియర్‌అసిస్టెంట్ అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

తాగునీటి ఇబ్బందులు

తాండూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తాండూర్ మండలంలోని తాండూర్, అచ్చలాపూర్, రేచిని గ్రామాల్లో నీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలో తాగు నీరు, నిత్యావసరాలకు నల్లా నీరు రావడం లేదు. మిషన్ భగీరథ నీరు ప్రెషర్ రావడం లేదని ప్రజలు పేర్కొన్నారు. ప్రత్యామ్నాయంగా ఉన్న బోరు పైపులైన్ పగిలిపోవడంతో నల్లా నీరు రాక ప్రజలు నీటి కోసం కష్టాలు పడుతున్నారు. అధికారులు స్పందించి తాగు నీటి కష్టాలు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ సమావేశం



మాట్లాడుతున్న నీలకంటేశ్వర్‌రావు

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ సమావేశాన్ని శుక్రవారం జిల్లా కేంద్రంలో రాష్ట్ర అధ్యక్షుడు నీలకంటేశ్వర్‌రావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 20న హైద్రాబాద్ గాంధీ భవన్‌లో జరిగే కాంగ్రెస్ సేవాదళ్ శతాబ్ది ఉత్సవాలకు నాయకులు పెద్ద సంఖ్యలో తరలి రావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు హఫీజ్, రాజన్న యాదవ్, ఉదయ్‌కుమార్, కలీం, శ్రీనివాస్‌గౌడ్, మోమిన్‌అలీ, రాజశేఖర్, పాషా, వంశీమోహన్ పాల్గొన్నారు.



చెన్నూరులోని జగన్నాథ స్వామి ఆలయం

జగమేలు స్వామి జగన్నాథుడు

- చెన్నూరులో పూరీ తరహాలో జగన్నాథస్వామి ఆలయం
- ఆలయానికి 400 ఏండ్ల చరిత్ర
- నేటికీ వంశపారపర్యంగానే కొనసాగుతున్న పూజలు
- పూరీ మాదిరిగానే ఇక్కడ రథయాత్ర

చెన్నూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జగమేలు ప్రభువు జగన్నాథుడుగా ప్రతీతి. ఒడిశా రాష్ట్రంలోని పూరీ మాదిరిగానే చెన్నూరులో కొలువై ఉన్నాడు జగన్నాథ స్వామి. భక్తుల నిత్య పూజలందుకుంటూ కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా విరాజిల్లుతున్నాడు. చెన్నూరులోని స్వామి ఆలయం దక్షిణ భారత దేశంలోని జగన్నాథ స్వామి ఆలయాల్లో రెండవదిగా పేరు గాంచింది.

చెన్నూరు జగన్నాథ స్వామి ఆలయానికి 400 సంవత్సరాల చరిత్ర ఉంది. పూరీలో చేసినట్టే ఇక్కడ కూడా యేటా స్వామి రథయాత్ర వైభవంగా నిర్వహిస్తారు. స్వామిని దర్శించుకునేందుకు రాష్ట్ర ప్రజలే కాకుండా ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల నుంచి కూడా భక్తులు వస్తుంటారు.

జగన్నాధ స్వామిని భక్తితో కొలిచిన వారికి అంతా మంచే జరుగుతుందని భక్తుల విశ్వాసం. అందుకే చెన్నూరు ప్రాంత ప్రజలు ఏ శుభకార్యం తలపెట్టినా ముందుగా స్వామి వారిని దర్శించుకోవడం ఆనవాయితీ. ఆలయంలో జగన్నాథ స్వామి మూల విగ్రహాలతోపాటు ఉత్సవ విగ్రహాలు ఉన్నాయి. సుభద్ర బాల రామకృష్ణుడు, వెంకటేశ్వరుడు, అలివేలు మంగ, పద్మావతి దేవి కొలువుదీరారు. కాకతీయుల కాలంలో ఇక్కడి సామంత రాజుకు జగన్నాథస్వామి కలలో కనిపించాడు. అగస్త్య మహాముని తపస్సు చేసిన ప్రాంతంలో తనకు పూజలు చేయాలని చెప్పాడు. వెంటనే రాజు పూరీకి వెళ్లి స్వామి వారి విగ్రహాన్ని తీసుకువచ్చి ఇక్కడ ప్రతిష్ఠించినట్లు చరిత్ర చెబుతుంది. ఆ తర్వాత కొంత కాలానికి ఆలయం కట్టించడంతో అప్పటి నుంచి స్వామి నిత్య పూజలందుకుంటున్నాడు.

నిత్య పూజలు, వేడుకలు

వైభవంగా సాగే పూరీ రథయాత్ర సందర్భంగా స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తారు. శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహిస్తారు. కార్తీకమాసంలో వారం రోజుల పాటు అఖండ భజన, కుంకుమార్చన, దీపారాధన చేస్తారు. ధనుర్మాసంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, గోదాదేవి, రంగనాధుల కల్యాణం, నర్సింహ హోమం నిర్వహిస్తారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్వామి వారి ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తారు.

ఎన్నో ప్రత్యేకతలు...

ఈ ఆలయ నిర్మాణంలో ఎన్నో ప్రత్యేకతలు కనిపిస్తాయి. ఇది హన్మకొండలోని వెయ్యి స్తంభాల గుడిని పోలి ఉంటుంది. పెద్ద పెద్ద రాతి స్తంభాలతో ఆలయాన్ని నిర్మించారు. గుడి ముందు కనిపించే రథం 400 సంవత్సరాల క్రితం తయారు చేసింది. గుడి ముందు ధ్వజస్తంభం ఉండగా దానికి ఆనుకుని ఉన్న చిన్న గుడిలో హన్మంతుడు వాయి దేవుడు కొలువై ఉన్నాడు. భక్తులు ముందుగా ఈశాన్యం దిశలో ఉన్న రావిచెట్టు చుట్టూ ప్రదక్షిణలు చేసిన తర్వాత గుడి చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామిని దర్శించుకుంటారు. ఆలయం ఆగ్నేయం దిశలో ఉన్న మేడి చెట్టు దగ్గర నాగదేవత విగ్రహం ఉంటుంది. ఇక్కడ భక్తులు దీపారాధన చేస్తే కోరిన కోర్కెలు తీరుతాయని నమ్ముతారు.



కొలువైన జగన్నాథ స్వామి వారు

కోరిన కోర్కెలు నెరవేరుతాయి

దామెర మోహనాచార్యులు, ఆలయ అర్చకులు



చెన్నూరులోని జగన్నాథస్వామి ఆలయానికి 400 ఏండ్ల చరిత్ర ఉంది. కాకతీయుల కాలంలో ఆలయాన్ని నిర్మించినట్లు పూర్వీకులు చెప్పారు. అయితే చారిత్రక ఆధారాలు లేవు. మా కుటుంబీకులు 4 శతాబ్దాల నుంచి వంశ పారపర్యంగా స్వామి సేవలో తరించడం పూర్వజన్మసుకృతంగా భావిస్తున్నాం. ఆ జగమేలు జగ న్నాథుడిని నిష్ఠతో కొలిస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయి.

వాగుపై తాత్కాలిక వంతెన నిర్మాణం



వాగులో పూర్తయిన తాత్కాలిక వంతెన

కాసిపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మందమర్రి- మామిడిగూడెం మధ్య వాగుపై వంతెన కష్టాలు అనే వార్తకు సింగరేణి యాజమాన్యం స్పందించింది. వాగుపై తాత్కాలిక వంతెనను శుక్రవారం ఏర్పాటుచేశారు. దీంతో మామిడిగూడెం, పెద్ద ధర్మారం గ్రామాల ప్రజలకు వంతెన కష్టాలు తీరాయి. వాగులో ఉన్న తాత్కాలిక వంతెన కొట్టుకుపోవడంతో విద్యార్థులు, అత్యవసరం వైద్యం కోసం ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వాగులో పైపులను ఏర్పాటు చేసిన మట్టి పోసి తాత్కాలిక వంతెను ఏర్పాటు చేయడంతో రాకపోకలు ప్రారంభమయ్యాయి.

శ్రమదానం

కాసిపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : సోమగూడెం -కాసిపేట మధ్య ఉన్న ఉన్న రోడ్డుపై ఏర్పడిన గుంతలతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో సోమగూడెం(కే) యువకులు, కాసిపేట మాజీ సర్పంచు భుక్య చందులాల్ ఆధ్వర్యంలో శుక్రవారం శ్రమదానంతో గుంతలను పూడ్చివేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, రాజలింగు, రమేష్, రాజలింగు, గోపి, సందీప్, స్వామి, రాయలింగు, రాజయ్య పాల్గొన్నారు.

రోడ్లపైకి చెట్ల కొమ్మలు



భీమారం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): భీమారం నుంచి ఆవడం వెళ్లే రహదారిలో, పోతనపల్లి, బూరుగుపల్లి, నర్సింగాపూర్ బీటీ రోడ్డు పైకి చెట్ల పొదలు వచ్చాయి. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనబడకపోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. ఎదురుగా వాహనం వచ్చినప్పుడు చెట్ల కొమ్మలు తగిలి గాయాలపాలవుతున్నారు. అధికారులు చొరవ చూపి రోడ్ల పైకి వచ్చిన చెట్ల కొమ్మలను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మందమర్రిరూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): చిర్రకుంట గ్రామంలో శుక్రవారం డ్రైనేజీ నిర్మాణ పనులను బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గందె రాంచందర్, మాజీ సర్పంచు ఒడ్నాల కొమురయ్యలు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ డీఎంఎఫ్‌టీ నిధులతో రోడ్డు పనులు చేపట్టామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతుందన్నారు. పీఏసీఎస్ డైరెక్టర్ పెద్దల రాజయ్య, మాజీ డైరెక్టర్ సత్యనారాయణ, బాలయ్య, సంపత్, పోశయ్య, మహేందర్, సుధాకర్, మోహన్, మనోజ్, శ్యామేందర్, శశికుమార్ పాల్గొన్నారు.

మందమర్రిటౌన్, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 18వ వార్డులో రూ. 5 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులు కాంగ్రెస్ నాయకుడు జావేద్‌ఖాన్, గోగుల రాజయ్యలు ప్రారంభించారు. నాయకులు సత్తయ్య, ఇసాక్, సారయ్య, గట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

● నాణేల కోసం ...



దండేపల్లి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గూడెం గోదావరి నది తీరంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా అధికసంఖ్యలో భక్తులు స్నానాలు ఆచరించారు. స్నానం అనంతరం భక్తులు కొబ్బరికాయ కొట్టి నాణేలు నదిలో వేస్తారు. నీటిలో, మరి కొందరు తెప్పపై కూర్చొని తాడుకు అయస్కాంతం సాయంతో నాణేలను, కొబ్బరికాయలను సేకరిస్తున్నారు.

కార్తీకమయం..

(5వ పేజీ తరువాయి..)

కాకుండా అదనంగా మరో వ్రత మండపం ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తి శ్రద్ధలతో సామూహిక వ్రతాలు నిర్వహించారు.

భారీ బందోబస్తు

మహాజాతర సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు భారీ బందోబస్తు చేపట్టారు. డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాష్, సీఐ నరేందర్, ఎస్‌ఐ ఉదయ్‌కిరణ్ ఆధ్వర్యంలో గోదావరి తీరం, ఆలయం వద్ద ప్రత్యేక బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసు అధికారులు పర్యవేక్షించారు. గోదావరి తీరం వద్ద గజఈతగాళ్ళను ఏర్పాటు చేశారు.

అయ్యప్ప దీక్షల స్వీకరణ

గూడెం అయ్యప్ప స్వామి ఆలయం వద్ద కార్తీక పౌర్ణమి సందర్భంగా అయ్యప్ప దీక్షలు స్వీకరించారు. సుమారు 600లకు పైగా భక్తులు గురుస్వామి పురుషోత్తమచార్యులచే దీక్షలు స్వీకరించారు. ఉదయం నుంచే గూడెం శబరిమలై అయ్యప్ప మందిరంలో అయ్యప్ప స్వాముల శరణుఘోషతో మార్మోగింది.

చెన్నూరు: చెన్నూరు పట్టణం, మండలంలో శుక్రవారం కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రజలు ఉదయాన్నే గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక దీపాలను వెలిగించారు. సాయంత్రం ఇండ్లలో కేదారేశ్వర వ్రతాలను నోముకున్నారు. చిన్నారులు,యువకులు బాణాసంచా కాల్చారు.

బెల్లంపల్లిరూరల్, (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి మండలంలోని కన్నాల సమీపంలోని రాజరాజేశ్వర స్వామి బుగ్గ ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం భారీ సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. బెల్లంపల్లి, తాండూర్, నెన్నెల, కాసిపేట, కన్నెపల్లి, భీమిని మండలాల నుంచి భక్తులు ఆలయానికి తరలి వచ్చారు. కార్తీక దీపాలను వెలిగించారు.

నస్పూర్, (ఆంధ్ర జ్యోతి): పట్టణంలో కా ర్తీక పౌర్ణమి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం ఇళ్లలోని తులసి వద్ద దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు. శివాలయాలు, వెంకటేశ్వర, హను మాన్ ఆలయాల వద్ద దీపాలు వెలిగిం చారు. సీతారాంపల్లి సమీపంలోని గోదావరిలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. కొందరు ఇళ్ళ వద్ద సత్య నారాయణ స్వామి వ్రతాలను నిర్వహిం చారు.

మందమర్రి టౌన్, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వెంకటేశ్వర ఆలయం, మూడో జోన్ రామాలయం, అంగడిబజార్ శివాలయాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. శివలింగానికి క్షీరాభిషేకం చేశారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు తులసి చెట్టు వద్ద దీపాలు వెలిగించారు. పట్టణంలోని మూడవ జోన్ సీతరామాంజనేయ స్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలను నిర్వహించారు.



మంచిర్యాల విశ్వనాథ ఆలయంలో జ్వాల తోరణం వద్ద భక్తులు

కన్నెపల్లి, (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. టేకులపల్లి ఆలయంలో భక్తులు, మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. రెబ్బెనలో సామూహిక సత్యనారాయణ వ్రతాల్లో పాల్గొన్నారు.

వేమనపల్లి, (ఆంధ్రజ్యోతి): ప్రాణహిత నదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి సమీప ఆలయాల్లో ప్రత్యేకపూజలు చేశా రు. మహి ళలు తులసీ కోట వద్ద పూజలు చేసి కార్తీక దీపాలను వెలిగించారు.

బెల్లంపల్లి: పట్టణంలో కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. పలు దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఇంటి ముందు దీపాలను వెలిగించి టపాసులను పేల్చారు.

జన్నారం (ఆంధ్రజ్యోతి) : మండలంలో కార్తీక పౌర్ణమి ఘనంగా జరిగింది. మహిళలు ఉదయం తులసీ చెట్టు వద్ద కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేశారు. పొనకల్, రేండ్లగూడ తదితర గ్రామాల్లోని ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. కలమడుగు, చింతగూడెం, బాదంపల్లి, తిమ్మాపూర్, రాంపూర్ గోదావరి స్నానఘట్టాల వద్ద పుణ్యస్నానాలు ఆచరించారు.

గర్మిళ్ల,(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విశ్వనాథ ఆలయంలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు కార్తీక దీపాలను వెలిగించారు. ఆలయ ఆవరణలో జ్వాలా తోరణం వెలిగించారు. అర్చకులు గోవర్ధన భట్టాచార్యులు, సంగనభట్ల నరహరిశర్మ, వామనభట్ల బాలకృష్ణశర్మ, కేశ్ శర్మలు పాల్గొన్నారు.



కన్నెపల్లిలో స్వామి వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు



గూడెం ఘాట్‌రోడ్డులో స్వామి దర్శనానికి భక్తుల బారులు



గూడెం ఆలయంలో మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు పూజలు



బుగ్గ ఆలయంలో కార్తీక దీపాలను వెలిగిస్తున్న మహిళలు



పట్టుదలతో చదివి.. కొలువులు సాధించి..

గ్రూప్ 4 ఉద్యోగాలు సాధించిన యువకులు

బెల్లంపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పట్టుదలతో చదివి ఉద్యోగాలు సాధించారు పలువురు యువకులు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్య, తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు, కార్మికులు అయినా మొక్కవోని పట్టుదలతో చదివి గ్రూప్ 4 విజేతలుగా నిలిచి శభాష్ అనిపించుకున్నారు. గురువారం విడుదలైన గ్రూప్ 4 ఫలితాల్లో జిల్లాలో ఎంతో మంది సత్తా చాటి ఉద్యోగాల సాధించారు.

ఉద్యోగంతో ఆనందం

మొగిలి రాజేందర్, బెల్లంపల్లి



తల్లిదండ్రులు కూరగాయల వ్యాపారం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివాను. బీటెక్ పూర్తి చేసి గ్రూప్ 4కు ప్రిపేర్ అయ్యాను. రైల్వేలో ఉద్యోగం సాధించలేకపోయాను. మళ్లీ కష్టపడి గ్రూప్ 4కు ప్రిపేర్ అయ్యాను. టీజీపీఎస్‌సీ విడుదల చేసిన గ్రూప్ 4 ఫలితాల్లో విజయం సాధించి ట్రెజరీ డిపార్టుమెంట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించడం ఆనందంగా ఉంది.

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో

రాంటెంకి సాయితేజ, బోయపల్లి



తండ్రి వ్యవసాయం చేస్తూ నన్ను చదివించాడు. చిన్నప్పటి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చదివాను. ఉద్యోగం సాధించాలనే తపన తో రైల్వే ఉద్యోగం కోసం పరీక్ష రాశాను. ఇందులో ఉత్తీర్ణత సాధించి సిగ్నల్ టెలికాం ట్రైనీస్టుగా ఉద్యోగం సాధించా. కొన్ని నెలులగా ఉద్యోగం చేస్తూనే గ్రూప్ 4కు ప్రిపేరై ఉత్తీర్ణత కావడంతో ఫ్యామిలీ వెల్ఫేర్ విభాగంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం వచ్చింది.

ప్రభుత్వ ఉద్యోగం సాధించాను


డోలి మధు, తాండూర్



ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని కష్టపడి చదివి గ్రూప్ 4కు ప్రిపేర్ అయ్యాను. విడుదలైన ఫలితాల్లో రెవెన్యూ విభాగంలో కమర్షియల్ టాక్స్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం వచ్చింది. నాన్న సింగరేణి కార్మికుడు.

నిరుత్సాహ పడకుండా

వికేష్, మంచిర్యాల



బీకాం పూర్తి చేసి కానిస్టేబుల్, ఎస్ఐ, జేఏవో, డీఏవో పరీక్షలు రాశాను. కొద్ది మార్కుల తేడాతో ఉద్యోగం రాలేదు. అయినా నిరుత్సాహ పడకుండా గ్రూప్ 4కు ప్రత్యేక ప్రణాళికతో ప్రిపేరయ్యాను. ఉత్తీర్ణత సాధించి మున్సిపాలిటీ డిపార్టుమెంట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించాను.

తల్లి ప్రోత్సాహంతో

మాసాడి మణికంఠ , బోయపల్లి



చిన్నగా ఉన్నప్పుడే తండ్రి చనిపోయాడు. అప్పటి నుంచి తల్లి పాలు అమ్ముతూ కుటుంబాన్ని పోషిస్తూ నన్ను చదివించింది. బీఎస్సీ పూర్తి చేశాను. కానిస్టేబుల్, ఎస్ఐ రాసినా కొన్ని మార్కుల తేడాతో ఉద్యోగం సాధించలేకపోయాను. ఉద్యోగం సాధించాలనే తపనతో గ్రూప్ 4కు ప్రిపేరై ఉత్తీర్ణత సాధించి మున్సిపాలిటీ డిపార్టుమెంట్‌లో వార్డు ఆఫీసర్‌గా ఉద్యోగం సాధించాను.

దండేపల్లి(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యా యుడు బోలిశెట్టి రాజన్న కుమారుడు సచిన్ రాహుల్ (ఆడిట్ అండ్ జనరల్ శాఖ), ప్రభుత్వ ఉపాధ్యాయుడు పాత రమేష్ కుమారులు ఇద్దరు విష్ణు నం దన్, దినేష్‌లు ఉద్యానవన శాఖలో జూనియర్ అసిస్టెంట్, బొమ్మెన మల్లేష్ కుమారుడు మధు ట్రెజరీ శాఖలో గ్రూప్ 4 ఉద్యోగులుగా ఎంపికయ్యారు. ఈ యేడాది ఫిబ్రవరిలో ఫలితాలు వెలువడగా 1:3లో అభ్యర్థులను ఎంపిక చేసి ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. గురువారం ఉద్యోగులుగా ఎంపికైన వారి జాబితా విడుదల చేయగా ఎంపికయ్యారు.



బొలిశెట్టి సచిన్ రాహుల్



బొమ్మెన మధు



పాత దినేష్



పాత విష్ణు



శ్రీకాంత్‌గౌడ్

చెన్నూరు, (ఆంధ్రజ్యోతి): కిష్టంపేట గ్రామానికి చెందిన బుర్ర శ్రీకాంత్ గౌడ్ గ్రూప్ 4లో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించాడు. బుర్ర రాజగౌడ్, పద్మలకు ముగ్గురు కుమారులు. తండ్రి గీత కార్మికుడిగా పనిచేస్తు చదివించారు. శ్రీకాంత్‌గౌడ్ గ్రూప్ 4 రాసి ఉద్యోగానికి ఎంపికయ్యాడు. పదో తరగతి వరకు గ్రామంలోని ప్రైవేటు పాఠశాలలో చదివాడు. ఇంటర్ కరీం నగర్‌లో, డిగ్రీ హైద్రాబాద్‌లో పూర్తి చేశాడు. ఐటీడీఏలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు.

ఒకే గ్రామంలో ఏడుగురికి

బెల్లంపల్లి, (ఆంధ్రజ్యోతి): తాండూర్ మండలంలోని బోయపల్లి గ్రామానికి చెందిన ఏడుగురు యువకులకు గ్రూప్ 4లో ఉద్యోగాలు వచ్చాయి. మాసాడి స్రవంతి మున్సిపాలిటీ వార్డు ఆఫీసర్‌గా, ముద్దం రూపశ్రీకి తెలంగాణ వైద్య విధాన పరిషత్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా, మాసాడి అరుణ్‌కుమార్ గిరిజన కో ఆపరేటివ్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా, ఇందూరి పురుషోత్తంకు మున్సిపాలిటీలో వార్డు ఆఫీసర్‌గా, మాసాడి మణికంఠకు మున్సిపాలిటీలో వార్డు ఆఫీసర్‌గా, రాంటెంకి సాయితేజకు పబ్లిక్ హెల్త్ ఫ్యామిలీ వెల్ఫేర్ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా, భీమ వెంకటేష్ తెలంగాణ వైద్య విధాన పరిషత్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగాలు వచ్చాయి.



లకావత్ రాజు



మామిడిపల్లి రామన్



నగూరి అనిల్‌కుమార్



సింగిరెడ్డి రణదీప్‌రెడ్డి

జన్నారం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : జన్నారం మండలానికి చెందిన ఏడుగురు యువకులు గ్రూప్ 4లో ఫలితాల్లో ఉద్యోగాలు సాధించారు. హాస్టల్ తండా గ్రామానికిచెందిన లకావత్ రాజు, రేండ్లగూడ గ్రామానికిచెందిన మామిడిపెల్లి రామన్, పొనకల్ గ్రామానికిచెందిన నగూరి అనిల్‌కుమార్, దేవునిగూడకు చెందిన సింగిరెడ్డి రణదీప్‌రెడ్డి, మహ్మదాబాద్‌కు చెందిన జాడి తిరుపతి, తిమ్మాపూర్‌కు చెందిన కుకటికారి దుర్గా ప్రసాద్, మురిమడుగు గ్రామానికి చెందిన ఎలగందుల మధుకర్‌లు ఉద్యోగాలు సాధించారు. వీరిని గ్రామస్తులు, బంధువులు అభినందించారు.



జాడి తిరుపతి



కుకటికారి దుర్గా ప్రసాద్



ఎలగందుల మధుకర్





అందరి దృష్టి ఎన్నికలపైనే

- ముగియనున్న మున్సిపల్ పాలకవర్గం గడువు
- మిగిలింది 76 రోజులే

కాగజ్‌నగర్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): సర్పంచ్, జడ్పీటీసీల పదవీకాలం ముగిసింది. మరో 76 రోజులు గడిస్తే మున్సిపల్ పాలకవర్గం గడువు కూడా ముగియనుంది. దీంతో అందరి దృష్టి ఎన్నికలపైనే ఉంది. ఊహించినట్టే తొలుత సర్పంచి, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు పూర్తికాగానే మున్సిపల్ ఎన్నికలు నిర్వహించే అవకాశాలున్నాయి. మున్సిపల్ పాలకవర్గం గడువు సమీపిస్తుండటంతో ఇప్పుడు అందరి దృష్టి అభ్యర్థుల ఎంపిక కోసం నడుస్తోంది. అన్నిపార్టీలు కూడా ఈ సారి గెలుపు గుర్రాల కోసం దృష్టి సారిస్తున్నాయి. 2019లోజరిగిన మున్సిపల్ ఎన్నికల్లో 30వార్డుల్లో 22మంది బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారే ఉండటం, మిగితా 8మంది ఇతర పార్టీలకు చెందిన ఉన్నారు. పూర్తిస్థాయి కోరం ఉండటం విశేషం. మున్సిపల్ చైర్మన్ ఎన్నికల్లో సద్దాం హుస్సేన్, రాచకొండ గిరిష్ పోటీపడగా, సద్దాం హుస్సేన్‌కు పట్టం కట్టారు. 26డిసెంబరు 2019నప్రమాణ స్వీకారం చేశారు. అయితే స్థానిక గొడవలతో మళ్లీ మున్సిపల్ చైర్మన్ సద్దాం హుస్సేన్‌పై అవిశ్వాస తీర్మాణం పెట్టి 2023డిసెంబరులో దించేశారు. షాహీన్ సుల్తానాకు పట్టం కట్టారు. మరో 76రోజులు గడిస్తే పాలకవర్గం ముగినుండటంతో అందరి దృష్టి ఇప్పుడు ఎవరిని ఎంపిక చేసుకోవాలనే దానిపై పడింది. కొత్త కౌన్సిలర్‌గా ఎవరికి పట్టం కట్టాలి..? అనే అంశాలపై చర్చ జరుగుతోంది. ఈ విషయంపై కూడా ప్రధానపార్టీలు దృష్టిసారించాయి. అధికారంలో ఉండటంతో కాంగ్రెస్ పార్టీ బలమైన అభ్యర్థులను పోటీలో దింపేందుకు ఏర్పాట్లు చేస్తోంది.

• గెలుపు గుర్రాల కోసం వేట..

స్థానిక సంస్థలతోపాటు మున్సిపల్ ఎన్నికల కోసం అన్ని పార్టీలు ముమ్మరంగా పావులు కదుపుతున్నాయి. అధికార పార్టీలో ఉన్న కాంగ్రెస్‌పార్టీ క్యాడర్‌ను బలపేతం చేసేందుకు ప్రయత్నాలు చేస్తోంది. అలాగే బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా అసెంబ్లీ ఎన్నికల్లో ఘెరమైన పరాభావం పొందగా, త్వరలో జరిగే ఎన్నికలపై పట్టు పెంచేందుకు పూర్తిస్థాయిలో సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు బీఆర్ఎస్ తరుపున రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో సిర్పూరు నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. పార్టీని బలోపేతం చేసేందుకు అడుగులు వేస్తున్నారు. సిర్పూరు నియోజకవర్గంలోని ఏడు మండలాలపై పట్టు పెంచుతున్నారు. మున్సిపాల్టీపై అన్ని వార్డుల్లో కార్యకర్తల సంఖ్యను పెంచుతున్నారు. సిర్పూరు నియోజకవర్గం అసెంబ్లీ స్థానం బీజేపీ ఖాతాలో పడటంతో బీజేపీ అభ్యర్థులను కూడా బరిలో దింపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సారి సిర్పూరు నియోజకవర్గంలో స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికల్లో మూడుపార్టీల పోరు జరిగే అవకాశాలున్నాయి. సిర్పూరు నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు తండ్రి పురుషోత్తంరావుకు ఈ ప్రాంతంలో చాలామంచి పేరు ఉండటం, పాల్వాయి క్యాడర్ ఉండటం విశేషం.

• వరుసగా స్థానిక సంస్థల ఎన్నికలు..

బీసీ జనగణన చేపట్టి ఆ తర్వాత గ్రామ పంచాయతీ, ప్రాదేశిక రిజర్వేషన్లు ఖరారు చేసి ఎన్నికలు చేపట్టాలని ఒకవైపు ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. ఇదిలా ఉండగా గత ఎన్నికలు జరిగినప్పుడు ప్రకటించిన రిజర్వేషన్లను ఐదేళ్లపాటు కొనసాగాలని అప్పటిప్రభుత్వం చట్టం రూపొందించింది. తొలుత సర్పంచి, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించే అవకాశాలున్నాయని అధికారులు పేర్కొంటుండగా ఈ ఎన్నికలు కాగానే మున్సిపల్ ఎన్నికలు నిర్వహించే అవకాశాలున్నాయి. ఈ లెక్కన మున్సిపల్ ఎన్నికలు ఏప్రిల్, మే నెలలో ఉండే అవకాశాలున్నాయని పలువురు రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

గ్రూపు-3పరీక్షా కేంద్రాల వద్ద 163సెక్షన్ విధింపు

• ఎస్పీ డీవీ శ్రీనివాసరావు



ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 17,18 తేదీల్లో నిర్వహించే గ్రూపు-3పరీక్షా కేంద్రాల వద్ద బీఎన్ఎస్ఎస్ 163 సెక్షన్ విధించామని ఎస్పీ డీవీశ్రీనివాసరావు అన్నారు. జిల్లాలో గ్రూపు-3 పరీక్షలకోసం ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పట్టణాల్లో మొత్తం 18కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్షాకేంద్రాలవద్ద పటిష్ఠమైన బందోబస్తు నిర్వహిస్తామన్నారు. బయోమెట్రిక్ సిస్టంతో పూర్తి పారదర్శకంగా పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. అభ్యర్థులు పరీక్షాకేంద్రాలకు పరీక్షా సమయానికి రెండుగంటల ముందే చేరుకోవాలన్నారు. మానసికగా ఎటువంటి ఆందోళన చెందకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు.


బాధిత కుటుంబానికి పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఆత్రం సుగుణ

జైనూర్, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన విఠల్ బాగురావ్ షిందే ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జీ ఆత్రం సుగుణ శుక్రవారం పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని ఆమె కుటుంబసభ్యులకు ధైర్యం కల్పించారు. కార్యక్రమంలో సంతోష్‌రాంజీ, దత్త, పవార్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన



పుస్తకాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రగ్రంథాలయంలో పుస్తకప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా అదనపుకలెక్టర్ దీపక్ తివారి హాజరై ప్రారంభించారు. అనంతరం పాఠకులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్స్ సదానందం, ప్రవీణ్, స్వర్ణలత, సతీదేవి, వెంకటరమణ, సిబ్బంది సలీం, రామయ్య, గోపి పాల్గొన్నారు.

ఎల్లారం గ్రామస్థుల పాదయాత్ర



పాదయాత్ర నిర్వహిస్తున్న ఎల్లారం గ్రామస్థులు

ఆసిఫాబాద్ రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని మండలంలోని ఎల్లారం గ్రామస్థులు శుక్రవారం పాదయాత్ర చేపట్టారు. ఎల్లారం గ్రామం నుంచి జిల్లాకేంద్రంలోని కేస్లాపూర్ ఆంజనేయస్వామి ఆలయం వరకు ఈ పాదయాత్రను చేపట్టారు. దారిపొడువునా పాటలతో పాదయాత్రను కొనసాగించారు. కేస్లాపూర్ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

గ్రూప్-4 ఉద్యోగానికి ఎంపిక



ఉప్పుల సాయికృష్ణ

కెరమెరి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుర్దాపూర్ గ్రామానికి చెందిన ఉప్పుల సాయికృష్ణ శుక్రవారం విడుదలైన గ్రూపు-4 ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించాడు. సాయికృష్ణ 2023 జూలైలో హైదరాబాద్‌లో జరిగిన పరీక్షలో పాల్గొనగా నేడు ఫలితాలు విడుదల య్యాయి. ప్రభుత్వ కొలువు సాధించిన సాయికృష్ణను తల్లిదండ్రులు, గ్రామస్థులు అభినందించారు.

తప్పులు లేకుండా సర్వే చేపట్టాలి

జైనూర్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిర్వహిస్తున్న సమగ్రసర్వేలో తప్పులు లేకుండా పార దర్శకంగా సర్వే నిర్వహించాలని కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు అబ్దుల్‌ముకీద్ కోరారు. మండలంలోని పోచంలొద్దిలో నిర్వహిస్తున్న సర్వేను ఆయన పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ సర్వేలో సమగ్రవివరాలు పొందుపర్చాలని, లబ్ధిదారులకు ఇబ్బందులు కలగకుండా సర్వే చేయాలని కోరారు.

బీర్సా ముండా స్ఫూర్తితో ముందుకు సాగాలి

• కలెక్టర్ వెంకటేష్ దోత్రే



బీర్సా ముండా చిత్రపటానికి పూల మాల వేస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్

ఆసిఫాబాద్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): బీర్సా ముండా స్ఫూర్తితో ప్రతిఒక్కరూ ముందుకుసాగాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో బీర్సా ముండా జయంతిని పురస్కరించుకొని గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీడైరెక్టర్ రమాదేవి ఆధ్వర్యంలో గిరిజన గౌరవదినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ దీపక్‌తివారి, జిల్లాఅటవీశాఖ అధికారి నీరజ్ కుమార్ టిబ్రేవాల్, ట్రైబల్‌వెల్ఫేర్ చీఫ్ ఇంజనీర్ శంకర్, డీపీవో భిక్షపతి, శిశుసంక్షేమ శాఖాధికారి భాస్కర్‌తో కలిసి కలెక్టర్ హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి బీర్సా ముండా చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. అనంతరం బీహార్ నుంచి ప్రధానిమోదీ ప్రసంగాన్ని వీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గిరిజనుల హక్కుల కోసం పోరాటం చేసిన మహనీయులను స్మరించు కోవాలని గుర్తు చేశారు. గిరిజనుల చట్టాలపై అవగాహన కార్యక్రమాలు చేపడతామన్నారు. పద్మశ్రీఅవార్డు గ్రహిత స్వర్గీయ కనకరాజును కూడా గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సంప్రదాయాలు గుర్తిండి పోయేలా కనకరాజు కృషి చేశారన్నారు. కార్యక్రమంలో గిరిజనసంఘాల నాయకులు, అంగన్‌వాడీలు, వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది, గిరిజన సంక్షేమశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అభాగ్యుడిని అక్కున చేర్చుకున్న యువకులు



కొత్త వసాతిలతో మతిస్థిమితం లేని వ్యక్తి

బెజ్జూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మానసిక స్థితి బాగాలేని ఓ యువకుడిని అక్కున చేర్చుకొని ఔదార్యాన్ని చాటుకున్నారు బెజ్జూరు యువకులు. మానసికస్థితి కోల్పోయిన ఓ యువకుడు కొద్దిరోజులుగా మండలకేంద్రంలో సంచరిస్తున్నాడు. యువకుడు స్థితిని గమనించిన బెజ్జూరుకు చెందిన యువకులు నీలేష్, పురుషోత్తం, రాజన్న, ఆర్ఎంపీ వైద్యుడు సూరజ్ తదితరులు సదరు వ్యక్తికి తలనీలాలు తీయించి స్నానం చేయించారు. కొత్త వస్త్రాలు అందజేశారు. మతిస్థిమితం లేని యువకుడిని అక్కున చేర్చుకున్న యువకులను పలువురు అభినందించారు.

మండలంలో పెసా గ్రామసభలు

వాంకిడి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): భగవాన్ బీర్సా ముండా జయంతిని పురస్కరించుకుని శుక్రవారం మండలంలోని గిరిజన గ్రామాల్లో పెసా చట్టంపై గ్రామ సభలు నిర్వహించారు. పాటగూడ, చౌపన్‌గూడ గ్రామ పంచాయతీల్లో ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ పాల్గొని పెసా, ఫారెస్ట్ రైట్ యాక్ట్, గ్రామపంచాయతీ డెవలప్‌మెంట్ ప్లాన్, గ్రామఅభివృద్ధి సూచికలపై అవగాహన కల్పిం చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సంగీత, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన

జైనూర్, నవంబరు15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పవర్‌గూడ, పొలాస, తదితర గ్రామాల్లో ఉపాధ్యా యులు ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ ఉత్కర్ష అభియాన్ పథకంపై శుక్రవాం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పథకం ముఖ్యఉద్దేశం, వాటి ప్రయోజనాలపై ప్రజలకు వివరించారు.కార్యక్రమంలో ఉపాధ్యా యులు మనోహర్, రాథోడ్ విజెందర్ పాల్గొన్నారు.



బెజ్జూరు శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



పెంచికలపేటలో సైకత శివలింగానికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



దహెగాంలో దీపారాధన చేస్తున్న భక్తులు

ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు



కెరమెరిలో నదిపక్కన పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఆసిఫాబాద్/కాగజ్‌నగర్/ బెజ్జూరు/ పెంచికలపేట/ దహెగాం/చింతలమానేపల్లి/కెరమెరి/కౌటాల/సిర్పూర్(టి)/ దహెగాం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంతోపాటు మండలాల్లో శుక్రవారం కార్తీకపౌర్ణమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. దీపారాధన, తులసీ కల్యాణం, భజనలు చేపట్టారు. మహిళలు తమ ఇళ్లలో తులసీ కల్యాణం చేపట్టి సమీపనదుల్లో దీపారాధన కార్యక్రమం నిర్వహించారు. మహిళలు దీపాలు వెలిగించి ఉసిరిక చెట్టు వద్ద పూజలు నిర్వహించారు.

పెంచికలపేట, దహెగాంలలో పెద్దవాగులో సైకతశివలింగానికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. భక్తులు కార్తీక దీపాలను పెద్దవాగులో వదిలారు. దహెగాం మండల కేంద్రంలోని శివకేశవ ఆలయంలో శుక్రవారం సాయంత్రం కార్తీక దీపోత్సవ సందడినెలకొంది. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్తీక దీపాలు వెలిగించారు.



ఆసిఫాబాద్‌లో ఆలయం ఎదుట దీపాలు వెలిగిస్తున్న మహిళలు



కౌటాల శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



కాగజ్‌నగర్: రావి చెట్టు వద్ద దీపాలను వెలిగిస్తున్న మహిళలు



చింతలమానేపల్లి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



దహెగాంలో శివకేశవ ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు